ప్రజాశక్తి
సోమవారం 6 మార్చి 2023
5
పార్వతీపురం మన్యం



కుక్కల దాడిలో కృష్ణజింక మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోకి ఆదివారం తెల్లవారుజామున కృష్ణ జింక ప్రవేశించింది. ఆ సమయంలో అక్కడే ఉన్న కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో జింకకు తీవ్ర గాయాలయ్యాయి. అది గమనించిన విద్యార్థులు కుక్కలను తరిమి విషయం సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది గాయపడ్డ జింకను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకు రాగా, వారు అటవీశాఖ అధికారులకు సమాచారం తెలిపారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.మనోజ్ సిబ్బందితో పోలీస్ స్టేషన్ చేరుకున్న సమయానికి జింక్ మృతి చెందింది. సెక్యూరిటీ గార్డ్ నుంచి జింక మృతిదేహాన్ని స్వాధీనం చేసుకొని జోగింపేట సమీపంలో ఆయన పర్యవేక్షణలో వెటర్నరీ డాక్టర్ రామారావు పోస్టుమార్టం నిర్వహించి అనంతరం ఖననం చేశారు.

హక్కులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడి

విలువలకు కట్టుబడి పనిచేసేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలే ● ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ● రమాప్రభను గెలిపించాలని పిలుపు

ప్రజాశక్తి-బొబ్బిలి/ విజయనగరంటౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తున్నాయని కృష్ణా, గుంటూరు పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆ దాడులను ఎదుర్కొని హక్కులు సాధించుకునేందుకు అందరూ కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని, అందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీల సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. 'కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రజాస్వామ్య హక్కులపై దాడి-మన కర్తవ్యం' అనే అంశంపై ఆదివారం బొబ్బిలి ఎన్‌జిఒ హోంలోనూ, 'ఉత్తరాంధ్ర అభివృద్ధి-శాసనమండలి ఎన్నికలు-పిడిఎఫ్ ప్రాధాన్యత' అనే అంశంపై విజయనగరం లోని ఎన్‌జిఒ హోంలోనూ సదస్సులు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతు, ప్రజా ఉద్యమాలపై రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దాడి చేస్తున్నాయన్నారు. నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. ఉద్యోగుల హక్కులపై దాడి జరుగుతున్నప్పటికీ ఎమ్మెల్యేలు, రాజకీయ పార్టీల ఎమ్మెల్సీలు నోరు మెదపడం లేదన్నారు. రాజ్యాంగ సూత్రాలకు లోబడి నిజాయితీగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పని చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, ప్రజల హక్కుల సాధనకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో గచ్చిబౌలి వద్ద ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అప్పటి ప్రభుత్వం 500 గజాల స్థలం ఇస్తే తీసుకోకుండా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు తిరస్కరించినట్లు చెప్పారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి.. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీలను అమలు చేయడం లేదన్నారు. విద్యా రంగాన్ని నాశనం చేసేందుకు నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చి ప్రాథమిక పాఠశాలలను మూసివేస్తున్నా రన్నారు. పెన్షన్ ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదని, ఉద్యోగుల హక్కు అని అన్నారు. ప్రతినెలా ఒకటో తేదీకి వేతనాలు ఇవ్వాలని, బకాయి డిఎలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు ద్వారానే పోరాడి సాధించుకోగలమని అన్నారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడి పని చేసేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని అన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలించాలి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కెఎస్ లక్ష్మణరావు కోరారు. శాసనమండలిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, అన్ని రంగాల ఉద్యోగులు సమస్యలు పరిష్కారానికి పిడిఎఫ్ పని చేస్తుందన్నారు. పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపిస్తే శాసనమండలిలో పిడిఎఫ్ బలం పెరిగి హక్కులు సాధనకు పని చేస్తామన్నారు. మేధావులను ఎన్నుకోవాల్సిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం సరికాదన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.జోగారావు, రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు రెడ్డి కృష్ణమూర్తి, ఎల్ఐసి యూనియన్ నాయకులు జి.శ్రీనివాసరావు, జెవివి నాయకులు జి.శ్రీనివాస్, యుటిఎఫ్ నాయకులు కె.విజయగౌరి, ప్రసన్నకుమార్, డివైఎఫ్ఐ నాయకులు సురేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు వాసు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నిరుద్యోగ యువతకు అండగా ఉంటా : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే నిరుద్యోగ యువతకు అండగా ఉండి, మీ సమస్యలపై చట్ట సభలలో గొంతు వినిపించి పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. నిరుద్యోగ అభ్యర్థులకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్రూప్ 2 అభ్యర్థులకు అవగాహన సదస్సు జరిగింది. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ హరీష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కృష్ణా, గుంటూరు జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సదస్సులో పాల్గొన్న రమాప్రభ మాట్లాడుతూ ముఖ్యంగా యువతకు జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేసి అన్యాయం చేసిందన్నారు. దానిపై పోరాటం చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులపై ఎన్నో కేసులు పెట్టి కక్ష సాధింపు చేస్తోందన్నారు. ఉత్తరాంధ్రలోని పరిశ్రమలను మూసివేయడంతో కూలీలు, నిరుద్యోగ యువత కూడా వలసలు పోతున్నార న్నారు. లక్షా 50వేల మందికి ఉపాధి కల్పిస్తూ, 3లక్షల కోట్లు విలువైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రూ.30వేల కోట్లకు అదానికి అమ్మేయాలని మోడీ ప్రభుత్వం చూస్తోందన్నారు. ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలంటే యువతంతా సంఘటితమై పోరాడాలన్నారు. నిరంతరం ప్రజా సేవలో ఉంటూ, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న తాను పిడిఎఫ్ ఎమ్మెల్సీల స్ఫూర్తితో నిరాడంబ రంగా, నిస్వార్థంతో ఉత్తరాంధ్ర హక్కుల కోసం, అభివృద్ధి కోసం, నిరుద్యోగ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

అకడమిక్ పాఠ్యపుస్తకాలతోనే మంచి ఫలితాలు

అకడమిక్ పాఠ్యపుస్తకాలు చదవడం ద్వారా గ్రూప్ 2 పరీక్షల్లో మంచి మార్కులు ,ఫలితాలు వచ్చే అవకాశం ఉందని కృష్ణా, గుంటూరు జిల్లాలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఎస్ఎఫ్ఐ, డి వైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్లో ఆదివారం గ్రూప్ 2 అభ్యర్థులకు అవగాహన సదస్సు జరిగింది. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ హరీష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గ్రూప్ 2 అభ్యర్థులు సంవత్సరాల తరబడి ప్రిపేర్ అవుతున్నా ప్రభుత్వం దానికి అనుగుణంగా పోస్టులు తీయడం లేదని అన్నారు. ప్రభుత్వం విడుదల చేస్తామంటున్న 185 పోస్టులు ఒక్క విజయనగరం జిల్లాకే సరిపోవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్‌లెస్ క్యాలెండర్ విడుదల చేసి యువత భవిష్యత్తుతో ఆడుకుంటోందని అన్నారు. ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసేలా గ్రూప్ 2 పోస్టులను పెంచాలని కోరారు. ఇదే సందర్భంలో విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం గ్రూప్ 2 పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. గ్రూప్ 2 పరీక్ష కు సిద్ధమయ్యే వారు ప్రధానంగా ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాలు చదవాలని చెబుతూ పరీక్ష పేపర్ ఉండే విధానాన్ని వివరించారు..అనంతరం నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్ అందచేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేష్, పి.రామ్మోహన్, డివైఎఫ్ఐ నాయకులు హరీష్, పావని ,యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్ కె ఈశ్వరరావు, నిరుద్యోగ అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైసిపిని (మా)వీడి... ఆ గట్టుకెళ్తారా?

● చుట్టరికపు మాటలేనా? ● రేగిన రాజకీయ దుమారం

ప్రజాశక్తి - మక్కువ

మావుడి సోదరులు

ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలు మక్కువ మండల వైసిపి నాయకులు మామిడి బ్రదర్స్ అధికార పార్టీ గట్టును వీడి ప్రతిపక్ష పార్టీ ఒడ్డుకు చేరతారంటూ ఊహగానాలు వినిపిస్తున్నాయి. ఇటీవల వైసిపి విడుదల చేసిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ జాబితాలో మావుడికి చోటు దక్కకపోవడంతో వీరు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రచారానికి ప్రాధాన్యత సంతరించుకుంది. సాలూరు నియోజకవర్గంలో మక్కువ మండలం చేరక ముందు నుంచి మావుడి వెంకటరావునాయుడు నాయకత్వంలో పార్వతీపురం నియోజకవర్గం ఎప్పుడు కాంగ్రెస్ ఖాతాలోనే ఉండేది. నాటి కాంగ్రెస్ తరం ముగిసిన తర్వాత సాలూరు నియోజకవర్గానికి మారినప్పటి నుంచి వైసిపి అధికారం దక్కించుకోవడానికి మావుడి సోదరుల పాత్ర కీలకమైందని చెప్పక తప్పదు. అప్పటి నుంచి రాజన్నదొర గెలుపులో కూడా కీలక పాత్ర వహించింది మావుడి సోదరులేనన్న జగమెరిగిన సత్యం. అంతేకాక మండలంలో ఏక నాయకత్వంలో అధికారాలన్ని చేపట్టడం కూడా వీరికే చెల్లుతుందన్నడి నానుడి. రాష్ట్ర విభజన అనంతరం జరిగిన ఎన్నికల సందర్భంలో అప్పటి సాలూరు నియోజకవర్గ నాయకులు, మాజీ ఎమ్మెల్యే భంజుదేవ్ కూడా రాయబారాలు జరిపినప్పటికీ వాటిని సున్నితంగా తిరస్కరించారన్నది తెలిసిందే. అయితే ఇటీవల జరిగిన పరిణామాలు ఒకంత మావుడి సోదరులకు మనస్థాపానికి గురిచేశాయని ఆ పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. అలాగే వైసిపి కేంద్ర నాయకత్వం కూడా పెద్దగా స్పందించకపోవడం కూడా ఒక కారణంగా తెలుస్తుంది. ఇటీవలే టిడిపి రాష్ట్ర మాజీ అధ్యక్షులు కిమిడి కళావెంకటరావు సమక్షంలో విశాఖ కేంద్రంగా చర్చలు జరిగాయన్న ఊహగానాలు రావడంతో మండల వైసిపిలో ఒకంత గుబులు రేగింది. మండలంలో ఒకటి, రెండు పంచాయతీల మినహాయిస్తే మిగిలిన పంచాయతీలన్నీ మావుడి సోదరులు శ్రీనివాస నాయుడు, రంగు నాయుడు నాయకత్వంలో వైసిపి అధికారంలో ఉంది. అలాగే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థాయి కాకపోయినా అంతటి పలుకుబడి కూడా వీరికి ఉంది. ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర కూడా స్థానికంగా వీరి మాట జవదాటలేని స్థితి.

అక్కడ అంత సఖ్యత దొరికేనా...!

ఒకవేళ కాలానుగుణంగా మావుడి సోదరులు తెలుగుదేశంలో చేరినా నియోజకవర్గ స్థాయిలో ప్రస్తుతం రాజన్నదొరతో వైసిపిలో ఉన్న సఖ్యత అక్కడ దొరికే పరిస్థితి లేదని పలువురు విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గం పరిధిలోని పలు మండలాల్లో టిడిపి రెండు గ్రూపులతో కొట్టుమిట్టాడుతుంది. సాలూరు నియోజకవర్గ నాయకత్వంతో పొసగడం కూడా అంత సులువేమీ కాదని పలువురు వైసిపి అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో మార్పులు చోటు చేసుకునే ఆస్కారం లేకపోలేదన్న అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

జ్యోతిరావు పూలే పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు

సాలూరు : మహాత్మా జ్యోతిరావు పూలే బిసి సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ మూకల పెంటయ్య తెలిపారు. జిల్లాలో సాలూరు బాలికల పాఠశాలలో 80సీట్లు, పార్వతీపురం పాఠశాలలో 40సీట్లు, కురుపాం బాలుర పాఠశాలలో 40సీట్లు ఉన్నాయని చెప్పారు. నాలుగో తరగతి స్థాయిలో ప్రతిభా పరీక్ష ఉంటుందన్నారు. తెలుగు, ఇంగ్లీష్, లెక్కలు, పరిసరాల విజ్ఞానం అంశాలపై 50 ప్రశ్నలుంటాయని తెలిపారు. రెండు గంటల సమయంలో పరీక్ష ఓఎంఆర్ సీట్లలో రాయాల్సి ఉంటుందని చెప్పారు. జిల్లాలో గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో నిరంతరాయంగా చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 9నుంచి 13ఏళ్ల వయస్సు, తల్లిదండ్రుల ఆదాయం లక్షరూపాయలు దాటని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొత్తం సీట్లలో 74శాతం సీట్లు బిసిలకు కేటాయించగా, మిగిలిన సీట్లు ఎస్సీ, ఎస్టీ, ఇబిసిలకు కేటాయిస్తున్నట్లు చెప్పారు. https://mjpapbcwreis.apsfss.in సైట్లో దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ మూకల పెంటయ్య విలేకరుల కు చెప్పారు.

సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలి

రైతుల ఆందోళన

ప్రజాశక్తి - పాచిపెంట

వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేసి మొక్కజొన్న, అరటి పంటల రైతులను ఆదుకోవాలని రైతు సంఘం, సిఐటియు నాయకులు మాదిరెడ్డి తిరుపతినాయుడు, కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సక్రమంగా విద్యుత్ సరఫరా చేసి పంటలను ఆదుకోవాలని కోరుతూ మండలంలోని కొత్తవలసలో రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 40 రోజులుగా వేళాపాలాలేకుండా విద్యుత్ కోతలు విధించడం వల్ల వ్యవసాయానికి సక్రమంగా నీరందక మొక్కజొన్న, అరటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ అధికారులను అడిగితే ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం చాలకపోవడంతో ఈ ఇబ్బంది జరుగుతుందని చెబుతున్నారని అన్నారు. కావున జిల్లా అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచి వ్యవసాయానికి సాగునీరందించాలని కోరారు. లేకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. బాధిత రైతులు మతల రమేష్, బొంగు అప్పలనాయుడు, లంకెన త్రినాధ, కిర్ల శంకర్రావు మాట్లాడుతూ సక్రమంగా విద్యుత్ అందించి తమను ఆదుకోవాలని కోరారు.

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మద్దతుగా ప్రచారం

పాచిపెంటలో ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - పాచిపెంట

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, పట్టభద్రులంతా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని విశ్వనాథపురంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ కోరెడ్ల రమాప్రభ గెలుపు ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టం అమలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షన్ల సమస్యల పరిష్కారానికి మలుపని అన్నారు. 250 సంఘాల మద్దతుతో కూడుకున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గెలుపుకై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావులను కదిలి వచ్చి గెలిపించాలని అన్నారు. శాసనమండలిలో పిడిఎఫ్ అభ్యర్థి గొంతు వినిపించేలా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చింతపోలు రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : పట్టభద్రుల శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల్లో పోటీ చేయుచున్న పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆదివారం స్థానిక టౌన్ సిఐ పివివిఎస్ఎన్ కృష్ణారావుకు, ఎస్ఐ సింహాచలంకు, సిబ్బందికి, కళింగవైశ్య రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులు, వెలుగు ఉద్యోగులను ప్రజాసంఘాల నాయకులు జి.వెంకటరమణ, పాకల సన్యాసిరావు కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాసనమండలిలో తమ గొంతు వినిపించేందుకు ఓటు వేసి గెలిపించి పంపించాలని కోరారు.

రమాప్రభకు మద్దతుగా సిపిఐ ప్రచారం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటిచేయుచున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యులు ఈవి నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు తమ గొంతు వినిపించడానికి, తమ సమస్యలను చర్చించడానికి డా. కోరెడ్ల రమాప్రభ వంటి వ్యక్తులు చట్టసభల్లో ఉంటే సామాన్య ప్రజానీక గొంతుకై చట్టసభల్లో మాట్లాడుతారని అన్నారు. ధన రాజకీయాల్లో ధన ప్రభావం చూపిస్తున్న నేటి రోజుల్లో ఇటువంటి విలువలు గల వ్యక్తులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, విజ్ఞత తెలిసిన వ్యక్తులుగా, చదువరులుగా ఇటువంటి బూర్జువా పార్టీలను ఓడించాలని పిలుప ునిచ్చారు. ప్రజా సమస్యలపై మాట్లాడగలిగిన చైతన్యవంతమైన డాక్టర్ కోరెడ్ల రమాప్రభ వంటి వారిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పట్టభద్రులు, ప్రైవేటు ఉద్యోగులు పాల్గొన్నారు. .

పార్వతీపురంలో పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్న సిపిఐ నాయకులు

కొమరాడ : మండలంలోని గుమడ, సీతారాంపురం, గుమడ రైల్వేస్టేషన్ పరిధిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభకు మద్దతుగా ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు కె.సాంబమూర్తి మాట్లాడుతూ ఉత్తరాంధ్రా ప్రజల సమస్యల వాణి మండలిలో వినిపించే సత్తా ఒక్క పిడిఎఫ్ ఎమ్మెల్సీలకే ఉందని, కావున పట్టభద్రులంతా విజ్ఞతతో రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

క్షయ నివారణే లక్ష్యం

● అవగాహనతోనే క్షయ, ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణ
● 'ప్రజాశక్తి'తో జిల్లా క్షయ నియంత్రణ అధికారి

శ్యామ్‌కుమార్ ముఖాముఖి





2025 నాటికి జిల్లాలో పూర్తిస్థాయిలో క్షయ వ్యాధిని నియంత్రించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి శ్యామ్ కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎంటిబిఎంఎ పథకం ద్వారా స్వచ్ఛంద సంస్థలు, దాతల ద్వారా టిబి సోకిన వారికి నెలకు రూ.700 అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు అవగాహన పెంచుకోవడం ద్వారా లెప్రసీ, ఎయిడ్స్, టిబి వ్యాధుల బారి నుంచి బయటపడే అవకాశం ఉందని తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలో టిబి, ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, నివారణా మార్గాల గురించి ఆయన వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు ఆయన మాటల్లో...

- ప్రజాశక్తి, కలెక్టరేట్

? జిల్లాలో క్షయ వ్యాధి ఏ స్థాయిలో ఉంది, నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి?.

జిల్లాలో ప్రస్తుతం 1809 క్షయ కేసులు ఉన్నాయి. 2017 నుండి 2022 క్షయ వ్యాధి కేసులు వరకు 40శాతం తగ్గాయి. జాతీయ సగటు లక్షకు 200 ఉండగా, మన్యం జిల్లాలో సగటు లక్షకు 180గా ఉంది. జిల్లాలో క్షయ సోకిన వారికి ప్రభుత్వం నుంచి మందులు అందిస్తూ నివారణా చర్యలు తీసుకుంటున్నాం. వ్యాధి తీవ్రత బట్టి 6 నెలల నుంచి మూడేళ్ల వరకు మందులు వాడాల్సి వస్తుంది. అదే ప్రాతిపదికన మందులు ఇచ్చి, వైద్య సేవలు అందిస్తున్నాం.

? క్షయను గుర్తించేందుకు తీసుకుంటున్న చర్యలేమిటి?

క్షయను గుర్తించేందుకు జిల్లాలోని అన్ని పిహెచ్‌సిల్లో పరీక్షలు చేస్తున్నారు. పిహెచ్‌సిలో మైక్రోస్కోప్, సిహెచ్ సిల్లో తురంట్, ఏరియా ఆసుపత్రిలో సిబినాట్ యంత్రాల ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. ఎక్స్‌రే కూడా తీస్తున్నాం. క్షయ గాలి ద్వారా సోకే అవకాశం ఉంది. దగ్గు, జ్వరం, ఎముకల నొప్పులు, పిల్లల్లో బరువు పెరగపోవడం వంటి లక్షణాలతో గుర్తించే అవకాశముంది. ఎక్కువగా ధూళిలో పని చేసే వారు, జ్యూట్ మిల్లు కార్మికులకు, సిగరెట్లు, మద్యం తాగేవారికి, డయాలిసిస్ రోగులకు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి క్షయ సోకే అవకాశముంది. శరీరంపై నొప్పి రాని మచ్చలు ఉన్నా, వచ్చినా లెప్రసీగా అనుమానించి పరీక్షలు చేయించుకోవాలి. లెప్రసీ ముఖంపై మచ్చలు సోకిన తర్వాత రెండేళ్ల నుంచి 30 ఏళ్లలో బయట పడే అవకాశముంది.

? క్షయ నివారణ ఎలా?.

క్షయ రెండు రకాలుగా ఉంటుంది. గుర్తించిన వెంటనే 6 నెలల వరకు మందులు వాడితే పూర్తిగా నివారణ అయ్యే అవకాశం ఉంది. రెండోది మొండి క్షయ. ఇది కొంచెం దీర్ఘకాలం ఉంటుంది. మందులు నిరంతరం వాడాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 17 నుంచి 24 వరకు క్షయవారోత్సవాలు నిర్వహించాం. దగ్గు, జ్వరం ఉన్న వారికి తప్పనిసరిగా టెస్ట్ జరిగేలా చర్యలు తీసుకున్నాం.

? క్షయ వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు?.

క్షయ సోకిన వారికి కేంద్ర ప్రభుత్వం నిక్షయపాత్ర యోజన కింద ప్రతి రోగికి నెలకు రూ.500 చొప్పున ఆర్నెళ్లు అందిస్తుంది. కొత్తగా పిఎంటిబిఎంఎ పథకం ద్వారా స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమల యజమానులు, ఉద్యోగుల నుంచి స్వచ్ఛందంగా పౌష్టికాహారం కోసం నెలకు రూ.700 అందజేస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో 28మందికి అందించాం.

? క్షయ, ఎయిడ్స్, లెప్రసీపై ప్రజల్లో అవగాహనకు చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి?.

జిల్లాలో క్షయ, ఎయిడ్స్, లెప్రసీపై ప్రజలు అప్రమత్తంగా ఉండలనే ఉద్దేశంతో ర్యాలీలు, అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం, సబ్ నేషనల్ క్షయ సర్టిఫికెట్ సర్వే , లెప్రసీ వ్యాధి నిర్ధారణ ప్రచారం నవంబర్ 15 నుంచి జనవరి 15 వరకు, లెప్రసీ క్యాంపెయిన్ జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు, పట్టణ లెప్రసీ నిర్ధారణ ప్రచారం మార్చి 1 నుంచి 21 వరకు జరుగుతుంది. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో వ్యాధి పట్ల అవగాహన, గుర్తింపు చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా గ్రామాల్లో ఆశా కార్యకర్తల సహకారంతో ఎవరికైనా వ్యాధి లక్షణాలుంటే వారికి పరీక్షలు చేయించి, అందిస్తున్నాం. కుటుంబ సభ్యులకు ఆ వ్యాధి ఎప్పటికప్పుడు వారికి పరీక్షలు చేస్తున్నాం. ప్రతి ఇంటినీ రెండేళ్లపాటు పర్యవేక్షిస్తున్నాం.

? క్షయ, లెప్రసీ, ఎయిడ్స్ వ్యాధుల నివారణ లక్ష్యాలేమిటి?.

జిల్లాలో 2025 నాటికి పూర్తి స్థాయిలో క్షయను నియంత్రించాలనేది లక్ష్యం. ప్రస్తుతానికి జిల్లాలో 21 లెప్రసీ కేసులు ఉన్నాయి. 1.2/10000 కేసులు ప్రస్తుతం ఉండగా దీనిని 1/10000 గా తీసుకురావడమే మన లక్ష్యం.

సదస్సులో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు రాజకుమారి

మహిళా హక్కులు కాపాడుకోవాలి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు జరుపుకోవడమంటే మహిళల హక్కులు కాపాడబడాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎస్.రాజకుమారి అన్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల హక్కులు- సవాళ్లు అనే అంశంపై సిఐటియు, ఐద్వా, యుటిఎఫ్ ఆధ్వర్యంలో సిఐటియు మండల కమిటీ అధ్యక్షులు బి.అమరవేణి అధ్యక్షతన స్థానిక వడమ రోడ్డు గల శ్రీవాసవి తిరుమల కల్యాణమండపంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, పోరాటాల ద్వారా సాధించుకున్న మహిళా హక్కులు ఆచరణలో నిర్వీర్యం అవుతున్నాయని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ నేటికీ కల్పించలేదన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో శ్రామిక మహిళలంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ ప్రపంచీకరణ విధానాల వల్ల మహిళలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం తదితర పథకాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ శాఖల్లోనూ, అసంఘటిత, సంఘటిత రంగాల్లోని మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనాలు, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేక, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు అనేక సమస్యలతో సతమాతమవుతున్నారని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో మహిళలకు తగిన ప్రాధాన్యత ప్రచార ఆర్భాటాల్లోనే తప్ప ఆచరణలో లేదన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి ఎస్.ఉమామహేశ్వరరావు, శ్రామిక మహిళ సంఘం నాయకులు ఎన్.హిమప్రభ, కె.గౌరీశ్వరి, సిహెచ్ భాగ్యలక్ష్మి, ఎ.పద్మావతి, వివిధ సంఘాల నాయకులు జి.జెస్సిబాయ్, జి.శారద, ఎం.శ్యామల, ధనలక్ష్మి, పి.లక్ష్మి, చిట్టెమ్మ, యశోద, మణి, గౌతమి, ధనలక్ష్మి, వివిధ రంగాల్లో పనిచేస్తున్న శ్రామిక మహిళలు పాల్గొన్నారు.

పుస్తకాలను అందజేస్తున్న సిఐ సత్యనారాయణ

పోటీ పరీక్షల పుస్తకాలు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం : నిరుద్యోగ యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పోటీ పరీక్షలకు సంబంధించి మెటీరియల్ అందజేసినట్లు ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ అన్నారు. త్వరలో జరగబోయే ఎస్ఐ ఉద్యోగ శిక్షణకు సంబంధించి స్థానికంగా శిక్షణ పొందుతున్న 30 మంది యువతకు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఆయన అందజేశారు. గిరిజన ప్రాంతంలో ప్రతిభ కలిగిన యువతీ యువకులున్నా సరైన ప్రోత్సాహం లేకపోవడంతో నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని అన్నారు. వీరి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆసక్తి కలిగి గల యువతీ యువకులకు పోటీ పరీక్షలు సమాచారం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు, ఎఎస్ఐ తిరుపతిరావు, పిడి ఉపాధ్యాయులు వైకుంఠరావు చంద్రమోహన్ ఉన్నారు.

సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారి ఉమామహేశ్వరి

ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం తప్పనిసరి

వీరఘట్టం: ఆరోగ్యాన్ని పరిక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యం ఆవరణలో సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యాయామంతో పాటు అప్పుడప్పుడు సైకిల్ కూడా తొక్కితే కొన్ని వ్యాధులు దూరంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకొకసారి వ్యాయాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మి, స్టాఫ్‌నర్స్ చిన్నమ్మడు, ఎంఎల్‌హెచ్‌పిలు భాగ్యరాధ, కావ్య, ఎఎన్ఎం ఉష, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు సమక్షంలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ పెదపెంకి-2 పాఠశాలలో ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. విజయనగరం వెంకట పుష్పగిరి కంటి హాస్పిటల్ ఆప్తామిస్ట్ వి.కిరణ్ 31 మందికి కళ్లు తనిఖీలు చేయగా 18మంది ఆపరేషన్లకు ఎంపికయ్యారని, వీరికి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. పెదపెంకితో పాటు బైరిపురం, తుమరాడ గ్రామాలకు నేత్ర రోగులు తనిఖీలు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో కాగాన సుధీర్, కర్రి సతీష్, పి.భాస్కర్, ఎం.శ్రీను, జి.శ్రావణ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

సీతంపేట : గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎ.గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మారుమూల గిరిజన గ్రామాల్లో నీటి సమస్య వెంటాడుతుందన్నారు. బోర్లు మరమ్మతులకు గురయ్యాయని, బావులు అడుగంటి పోయాయని తెలిపారు. కావున అధికారులు స్పందించి తక్షణమే గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఆర్థికసాయాన్ని అందజేస్తున్న సర్పంచ్, ఎఎంసి మాజీ ఛైర్మన్

వైఎస్ఆర్ బీమా సాయం అందజేత

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠపురం పంచాయతీ పొక్కిరికి చెందిన బిడ్డిక గణపతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన తెలుసుకున్న వెంటనే ఆమె కుమారునికి వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10వేలును సర్పంచ్ ఎ.మన్మదరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ ఎన్.వెంకటరావు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలకు తక్షణ సహాయం కింద రూ.10వేలు వెంటనే అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు , యువత పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్‌కుమార్

పేదలకు అందుబాటులో న్యాయ సేవలు

పాలకొండ : పేదలకు న్యాయసేవలను అందుబాటులో ఉంచడమే లక్ష్యమనిన్యాయసేవాధికార సంస్థ మండల అధ్యక్షులు, జడ్జి అగ్గాల విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని అంపిలిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలు సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రౌతు సత్యనారాయణ, సరళా కుమారి, విజయలక్ష్మి, ఎస్ఐ బి.శివప్రసాద్, వైస్ ఎంపిపి వి.అనీల్‌కుమార్, సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

వీరఘట్టం : మండలంలోని తెట్టంగి గ్రామ సమీపంలో నడిమి చెరువు నుంచి ఎటువంటి అనుమతి లేకుండా కొంతమంది వ్యక్తులు ఆదివారం మట్టిని తరలించుకుపోతున్నారు. మండలంలో సహజ సంపదైన ఇసుక, కంకర, మట్టి వంటి సంపదను అక్రమ దారులు అక్రమంగా తరలిం చుకు పోతున్నారు.

నడిమి చెరువులో మట్టి తవ్వుతున్న జెసిబి

లోవరకండి... గొంతు ఎండుతోంది

- ఆరు నెలలుగా తాగునీటికి అవస్థలు
- రక్షిత పథకం, చేతిబోర్లు పాడైనా పట్టించుకోని అధికారులు

రక్షిత మంచినీటి పథకం ద్వారా గానీ, చేతి పంపు ద్వారా గానీ ఆరు నెలలుగా తాగునీటికి నోచుకోని ఊరది. ఎక్కడో ఎత్తైన కొండల్లో ఉండే ఊరు కూడా కాదు... మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండే గిరిజన గ్రామం అది.. రక్షిత మంచినీటి పథకం, బోర్లు పాడైపోవడంతో తాగునీటి కోసం ఊరంతా పామాయిల్ తోట రైతు పైనే ఆధారం. శీతాకాలం దాటి వేసవికాలం సమీపిస్తున్నా తాగునీటి పథకాలు మరమ్మతులకు నోచుకోలేదు... తాగునీరందించాలని లోవరకండి గిరిజనులు ఎంత మొరపెట్టినా పట్టించుకోని సచివాలయ, మండల అధికారులు.. వివరాల్లోకి వెళ్తే...

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దేవరశర్లం పరిధిలోని గిరిజన గ్రామం లోవరకండి. ఈ గ్రామంలో సుమారు 300మంది గిరిజనులు నివసిస్తున్నారు. మండల కేంద్రానికి దాదాపు ఏడు కిలోమీటర్ల దూరంలో గల మైదాన గిరిజన ప్రాంతం ఇది. మండల కేంద్రంలోని పంచాయతీ కేంద్రానికి నిత్యం ఈ గ్రామం గుండానే అధికారులు ప్రయాణిస్తూనే ఉంటారు. గత ఆరు నెలలుగా గ్రామంలో రక్షిత మంచినీటి పథకం పాడైపోయి తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ఈ గ్రామ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ గ్రామంలో ఉన్న రెండు తాగునీటి బోరుబావులు కూడా పూర్తిగా పాడైపోయాయి. దీంతో గిరిజనులు తాగునీటి కోసం అల్లాడే పరిస్థితి ఏర్పడింది. గిరిజనులు పడుతున్న అవస్థలను చూసి గ్రామం పక్కనే ఉన్న ఆయిల్ పామ్ రైతు కనికరించి తమ తోటకు వేసుకున్న డ్రిప్ ద్వారా గిరిజనులకు తాగునీరు అందిస్తున్నారు. ఎప్పుడు కరెంటు వచ్చి మోటారు వేస్తారో అప్పటి వరకు వేచి చూసి నీరు పట్టుకోవాల్సి వస్తుందని గిరిజన మహిళలు ఆవేదన చెందుతున్నారు. లేకుంటే కిలోమీటరు దూరానున్న గోముఖీ నదికి నడిచి వెళ్లాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలపై స్థానిక సచివాలయ కార్యదర్శికి, సర్పంచికి పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు దయాదక్షిణ్యాలతో గొంతు తడుపుకోవాల్సి వస్తోందని, అతను నిరాకరిస్తే గొంతులు ఎండి చావాల్సిందే తప్ప వేరే మార్గం లేదని కన్నీరు మున్నీరవుతున్నారు వేసవి సమీపించడంతో తాగునీటి కోసం మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు కలత చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి గ్రామానికి రక్షిత పథకం ద్వారా గానీ చేతి పంపుల ద్వారా నైనా తాగునీరందేలా చర్యలు తీసుకోవాలని లోవర్‌కండి గిరిజనులు కోరుతున్నారు.

రైలు బోరు వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

రేషన్ వ్యాన్‌పై సిఎం జగన్ ఫొటో

ఎన్నికల నియమావళి ఉన్నట్టా? లేనట్టా?

ప్రజాశక్తి - వీరఘట్టం

ఈనెల 13న జరగనున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనలను అధికారులు యథేచ్ఛగానే ఉల్లంఘిస్తున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో, బహిరంగస్థలాల్లో ఏ పార్టీలకు చెందిన బొమ్మలు, బ్యానర్లు ఉండకూడదన్న స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ ఇక్కడ అధికారులు నిబంధనలకు నీళ్లొదుతున్నారు. రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వ వాహనాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బొమ్మలను తొలగించకపోవడంతో ఎన్నికల నియమాలు ఉన్నదా ?లేదా? ప్రజల నుండి విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఎన్నికల నిబంధనలను తూచా తప్పక పాటించాలని కోరుతున్నారు.

రేషన్ బియ్యం అందక అవస్థలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ఈత మానుగూడ పంచాయతీల్లో గిరిజనులకు రెండునెలలుగా రేషన్ బియ్యం అందక గిరిజనులు ఆకలితో అలమటిస్తున్నారని ఎపి గిరిజన సంఘం నాయకులు బిడ్డిక అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మండ కెపి, యాతమానుగూడ తదితర గిరిజన గ్రామాలకు గత రెండునెలలుగా రేషన్ బియ్యం అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతేడాది కూడా ఇలాగే నాలుగు నెలలుగా రేషన్ బియ్యం అందక ఇబ్బందులు పడ్డామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులను ప్రశ్నిస్తే నెట్‌వర్క్ సమస్య అని చెబుతున్నారు తప్ప సమస్యను పరిష్కరించడంలేదన్నారు. దీంతో గిరిజనులకు పస్తులు తప్పడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రేషన్ బియ్యం అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కష్టమంతా మట్టి పాలు

- ఇంకా కళ్లాల్లోనే ధాన్యం
- కొనుగోలు లేక రైతులకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ధాన్యం కొనుగోలు లేక సక్రమంగా జరగకపోవడంతో ఎక్కడికక్కడే ధాన్యం కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని నడుకూరు, తూడి, చిదిమి, చలివేంద్రి, దశమంతపురం, నర్సిపురం, యు. వెంకంపేట గ్రామాల్లో అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేయవలసి ఉన్నప్పటికీ కొనకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ధాన్యం బస్తాల్లో వేసి సుమారు మూడు నెలలు కావస్తున్నప్పటికీ కొనుగోలు లేకపోవడంతో ఎండకి ఎండి మంచుకు తడిసి గోనెసంచులు పగలిపోవడంతో రైతు కష్టమంతా నేలపాలవుతుంది. ఇందులో భాగంగానే కొట్టు గుమ్మడ గ్రామంలో నేటికీ ధాన్యం కొనుగోలు లేక రైతు ఆరుగాలం కష్టించి పండించిన పంట కళ్ళ ముందు నేలపాలు కావడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేయలేదని, గత నెల 16వ తేదీన నర్సిపురం, చలివేంద్రి గ్రామ రైతులు ప్రధాన రహదారికి అడ్డంగా ధాన్యం బస్తాలు వేసి రాస్తారోకు కార్యక్రమం చేపట్టడం పాఠకులకు తెలిసిందే. ఈ రాస్తారోకో కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పర్యటనకు కూడా చుక్కెదురైంది. అప్పట్లో కలెక్టర్ స్పందించి ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. కానీ ఇంకా చాలా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు లేక రైతులు కళ్లాల్లో కాపలకాయ వలసిన పరిస్థితి ఏర్పడుతుంది. మరోవైపు మండలంలో ఏనుగులు గుంపు సంచారం కారణంగా తమ పంటలను నాశనం చేస్తాయేమోనని భయంతో అనుక్షణం భయంతో కాలం గడుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

కొట్టుగుమ్మడ గ్రామంలో ధాన్యం బస్తాలు చినిగిపోవడంతో నేల పాలైన పంట

పిల్లలకు పలకలు, బలపాలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

రెడ్ క్రాస్ ఆధ్వర్యాన ఉచిత వైద్య సేవలు

పార్వతీపురంరూరల్ : మండలంలోని పెదమరికి పంచాయతీ కొత్త చందలింగి, పాత చందలింగిలో రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, ప్రధాని కార్యదర్శి బి.నాగభూషణరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్త్రీ ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ యాళ్ల పద్మజ, చిన్న పిల్లల వైద్య నిపుణులు యాళ్ల రజిని ప్రియ పరీక్షలు చేశారు. గర్భిణీలకు, మహిళలకు, చిన్నపిల్లలకు, వృద్ధులతో పాటు అందరికీ వైద్య తనిఖీ నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. గిరిజన గ్రామాల్లో మహిళలు, పిల్లలు, ప్రజలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరికి డాక్టర్ పద్మజ తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయా గ్రామాలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంబంధించిన 60 హైజానిక్ కిట్లను అందజేశారు. చిన్నపిల్లలకు పలకలు, బలపాలు, బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. రెడ్‌క్రాస్ కోశాధికారి పెంటపాటి సూర్యారావు చేతుల మీదుగా నువ్వు, పప్పు ఉండల ప్యాకెట్లను పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు బోటు రామకృష్ణ, అప్పల నరసయ్య, తాడి రమేష్, గెంబలి గణేష్, చెరుకూరు జగదీశ్వరరావు, ముని సాయి, చుక్క చంద్రావు, వెంకటరమణ, జి.మధుసూదన్‌రావు హరినాధ లక్ష్మణరావు , యమ్మల జనార్ధన రావు పాల్గొన్నారు.

విజయాలకు అద్దం పట్టేలా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

ముఖ్యంగా మహిళలు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విజయాలను గౌరవించడం కోసం ఇది విస్తృతంగా మహిళా దినోత్సవం నిర్వహించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈనెల 8న మహిళా దినోత్సవం సందర్భంగా నియోజకవర్గం కేంద్రంలో పట్టణంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం, శ్రీ వాసవీ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు అంతర్జాతీయ మహిళ దినోత్సవం వేడుకలు ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. మహిళా సంఘం సభ్యులు, వారి గొప్పతనం, ప్రాముఖ్యతను తెలుపుతూ పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలగా నిలిచిన బృందాలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి ఏటా మార్చి 8 న జరుపుకొంటున్న విషయం అందరికీ తెలిసిందేనని, ఆరోజు ముఖ్యంగా మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కతిక విజయాలను గౌరవించడం కోసం ఇది విస్తృతంగా నిర్వహిస్తారని తెలిపారు. లింగ సమానత్వం, పునరుత్పత్తి హక్కులు, మహిళలపై హింస, సమాన హక్కులు మొదలైన సమస్యలపై ఎక్కువగా చర్చిస్తూ మహిళలను పురుషులతో సమానంగా భావించినప్పుడే మనం సామాజికంగా అభివృద్ధి చెందుతామని అన్నారు. పురుషులంతా తమ భాగస్వామిని గౌరవించాలని ఎమ్మెల్యే పిలుపు ఇచ్చారు. మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కతిక విజయాలకి అద్దం పట్టే దినోత్సవమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని, తమ హక్కుల కోసం పోరాడిన ముఖ్యమైన మహిళలందర్నీ ఆ రోజు స్మరించుకోనే గొప్ప దినం అని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఇండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, శ్రీ వాసవీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, సభ్యులు, మహిళా సంఘం సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఉచిత తాగునీటి కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో ప్రధాన రహదారిలో గల శ్రీ భవాని మాత ఆలయం వద్దకు వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు స్టేట్ కళింగ వైశ్య బిసి కార్పొరేషన్ డైరెక్టర్ లాడే మెహర్ ప్రసాద్ తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి కేంద్రాన్ని (ఆర్ఒ ప్లాంట్) స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలన్న దృక్పథం, వారికి అండగా ఉండాలని మంచి మనసు కలిగిన వారిలో వైశ్యులు ఎప్పుడు ముందుంటారని, దీనికి నేడు తన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసిన ఈ కార్యక్రమమే ఒక చక్కని ఉదాహరణ అని అన్నారు. కళింగ వైశ్య రాష్ట్ర డైరెక్టర్ మెహర్ ప్రసాద్ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉచిత మంచినీటి కేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఉదారతను చాటు కోవడంలోనూ, పేద ప్రజలకు అండగా నిలవడంలోనూ ఏప్పుడు ముందుండే వైశ్యులని, మునుముందు కూడా ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించి పేద ప్రజలకు అండగా నిలవాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ అందవరపు సూరిబాబు, రాష్ట్ర అధ్యక్షులు పాట్నాన శ్రీనివాసరావు, జిల్లా రైస్ మిల్ సంఘం అధ్యక్షులు కొత్తకోట రమేష్, కళింగ వైశ్య సంఘం సభ్యులు, పెద్దలు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్

విజయనగరం : రింగ్‌రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాల టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. లేడీస్ రిక్రియేషన్‌క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వి.శ్రీనివాసరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ టెన్త్ పరీక్షల్లో విద్యార్థుల నూరు శాతం ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రుల కలను సాకారం చేయాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులకు బంగారు బాట వేసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా టెన్త్ ఫలితాల్లో పాఠశాలను ఉన్నత స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైస్ ప్రిన్సిపాల్ జగదీష్, డీన్లు సాయి కిశోర్, సత్యనారాయణ, అప్పలనాయుడు విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి పలు సూచనలు చేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రకృతి సేద్యం ద్వారా బెల్లం తయారీ

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రకృతి సేద్యం ద్వారా ఎలాంటి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా చెరుకు సాగుచేసి, దాని ద్వారా ప్రకృతి సేద్యం ద్వారా బెల్లం తయారీని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు పరిశీలించారు. మండలంలోని మాతమూరులో రైతు నూకల సోములు ఈ బెల్లాన్ని తయారు చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ తాను ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా కేవలం ద్రవ జీవామృతం, నూనెల ద్రావణాలు జిల్లేడు కషాయం వంటి సహజ ఎరువులను మాత్రమే వాడుతూ ప్రకృతి సేద్య సిబ్బంది సూచనలను పాటిస్తూ బెల్లం తయారు చేస్తున్నానని తెలిపారు. తాను పండించిన బెల్లాన్ని ఇంటి వద్దనే విక్రయించడం వల్ల మంచి లాభం వస్తుందన్నారు. అనేక మంది తన వద్ద సహజ బెల్లం దొరుకుతుందని తెలుసుకుని ఇంటికి వచ్చి తీసుకెళ్తారని, సహజ పద్ధతుల్లో పండించడం వల్ల ఖర్చు కూడా బాగా తగ్గిందని తెలిపారు. గతంలో పనిచేసిన సిఆర్‌పి బూరాడ శ్రీనివాసరావు సరైన సలహాలు, సూచనలు అందించారని తెలిపారు. ప్రస్తుతం తాను కేజీ బెల్లం రూ.50 చొప్పున విక్రయిస్తున్నానన్నారు. సహజ పద్ధతుల్లో ప్రకృతి సేద్యం ద్వారా సాగు చేపడితే వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. బెల్లం తయారీని ప్రకృతి సిబ్బంది యశోదమ్మ, బాలకష్ణ, విఎఎ దినేష్ పరిశీలించారు.

విత్తన గుళికలు తయారీపై అవగాహన

పార్వతీపురం రూరల్: మండలంలోని గోచెక్క పంచాయతీ లిడికివలసలో నవధాన్యాలు విత్తన గుళికలు (సీడ్ బాల్స్) తయారు విధానంపై రైతులకు అవగాహన ఆదివారం కల్పించారు. మండల యాంకర్ గంట తవుడు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వాతావరణ మార్పుల వల్ల వర్షాలు పడకపోవడం, పొడి భూముల్లో పంటలు వేయకపోవడం వంటి పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో విత్తన గుళికలు తయారు చేసుకొని పొడి భూముల్లో చల్లుకోవాలన్నారు. ఈ విత్తన గుళికలు తయారు చేయడం వల్ల భూమిలో ఉన్న తెగుళ్ల నుంచి చీడ పీడల తట్టుకుంటుందన్నారు. అలాగే విత్తనంలో తేమ శాతం నిల్వ ఉంటుందన్నారు. విత్తనాలను పక్షులు, చీమలు, పురుగులు తినకుండా ఉంటాయని, వర్షం పడే వరకూ విత్తనాలు చెడిపోకుండా భద్రంగా ఉంటాయని తెలిపారు. వర్షం పడిన తర్వాత మొలకెత్తుతాయన్నారు. కావున రైతులంతా ఈ విధంగా విత్తన గుళికలు తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు ఉర్లక నాగార్జున, ప్రశాంత్, రైతులు నాసిక త్రినాధ్, ఉర్లక సత్యం, రామకృష్ణ బంగార్రాజు, రూపవతి, కష్ణవేణి, ధనలక్ష్మి, విజయమ్మ, చంద్రకళ, గరికమ్మ పాల్గొన్నారు.

మనస్థాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జియ్యమ్మవలస మండలం గొర్లి గ్రామానికి చెందిన మెల్లిక తవిటమ్మ అనే గిరిజన మహిళ గత కొద్ది నెలలుగా దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. గత వారం రోజులుగా వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో మనస్థాపం చెంది శనివారం తన ఇంట్లో ఉన్న చీమల మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న భర్త చక్రపాణి వెంటనే 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

వీరఘట్టం : మండలం యు.వెంకంపేట పంచాయతీ వెంకమ్మ సాగరం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఎ.దిలీప్ యు వెంకంపేట నుండి వస్తుండగా వెంకమ్మ సాగర్ దగ్గర నుంచి ఎదురుగా ఇంకొక ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొనడంతో దిలీపు అరుణ్ కుమార్‌కు గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం మేరకు 08 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహారాజశ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.E.P.17/2019 in O.S.34/2016

Between:
కొత్తా శ్రీనివాసరావు ..... D.Hr - వాది
And:
శిల్లా తవిటిరాజు ......J.Dr - ప్రతివాది

నోటీసు

To,
శిల్లా తవిటిరాజు, S/o లేటు కాంతరాజు, హిందూ, వ్యాపారం, R/o కోమటపేట వీధి, పాలకొండ Erstwhile శ్రీకాకుళం జిల్లా, ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా.

యిందలి D.Hr - వాది, J.Dr - ప్రతివాదిపైన మ॥ రాజాం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో O.E.P. 17/2019 in O.S. 34/2016 నంబరు గల అమలు దాఖలు చేసియున్నారు. యిందు విషయమై J.Dr అయిన మీకు ఎట్టి ఆక్షేపణలు వున్న ఎడల పై కోర్టులో స్వయంగా గాని లేదా ప్లీడరు గారు ద్వారా గాని **తే 20-03-2023దీ పగలు గం 10-30**లకు పై కోర్టుకి హాజరై మీ ఆక్షేపణలను తెలియచేసుకోవలెను. లేని ఎడల J.Dr కి ఎట్టి ఆక్షేపణలు లేవని మీ పరోక్షమందు తీర్మాణించబడునని యిందుమూలంగా ప్రకటించడమైనది.

R.రామమూర్తి
K.ఆనందుకుమార్
D.Hr తరుపు న్యాయవాదులు
రాజాం